🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
✆ : 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 49 | 04-09-2023 | పుటలు : 4


# నన్నయలో ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

## వివిధ రంగాల్లో ప్రభుత్వ హంస పురస్కారాలు ప్రదానం




గిడుగు చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పిస్తున్న అతిథులు

**29.08.23 (మీడియాసెల్)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో హంస పురస్కారాలు 2023 కార్యక్రమాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీ సెమినార్ హాల్ లో నిర్వహించారు. అకాడమీ చైర్ పర్సన్ డా.నందమూరి లక్ష్మీపార్వతి నిర్వహణలో వీసీ ఆచార్య కె.పద్మరాజు సభాధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పౌరసరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖామంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీ మార్గాని భరత్, విశ్రాంత ఆచార్యులు ప్రముఖ సాహితీవేత్త ఆచార్య శలాక రఘునాథశర్మ, ప్రముఖ సామాజిక సేవకురాలు, సాహితీవేత్త జక్కంపూడి విజయలక్ష్మి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గిడుగు వేంకటరామ్మూర్తి పంతులుగారి 160వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని వివరిస్తూ, ఆయా దేశాలలో తెలుగు భాషకు ఇస్తున్న గౌరవాన్ని వివరించారు. దేశభాషలందు తెలుగులెస్స అనే మహనీయుల మాటలను గుర్తుచేసారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి మన్ కి బాత్ లో భాగంగా మాట్లాడుతూ దేశంలోని వారసత్వ భాషల్లో తెలుగు ఒకటని, తెలుగు సాహిత్యం వారసత్వ సంపదలో భారతీయ సంస్కృతికి సంబంధించిన వెలకట్టలేని అద్భుతాలు ఉన్నాయని, ఆ భాషలోని సాహిత్యాన్ని గొప్పతనాన్ని ప్రపంచానికి చాటే ప్రయత్నం చేస్తామని మోడీ తెలియజేసారన్నారు. తెలుగు ఔన్నత్యాన్ని పెంపొందించే విధంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పని చేస్తుందని అన్నారు. ఇటీవల నన్నయ విశ్వవిద్యాలయంలో నన్నయ సహస్రాబ్ది ఉత్సవాలను రెండు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రభుత్వ పురస్కారాలు నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు.

తెలుగు, సంస్కృత అకాడమీ చైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ సిఎం వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు, సంస్కృత అకాడమీ ని ఏర్పాటు చేసి ఎన్నో సాహిత్య కార్యక్రమాలకు, భాషాభివృద్ధి కార్యక్రమాలకు పూనుకున్నారని చెప్పారు. అకాడమీ తరపున పాఠ్యపుస్తకాలను ప్రచురిస్తున్నామని, సాహిత్యవేత్తలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. దీనిలో భాగంగా అకాడమీ ఆధ్వర్యంలో హంస పురస్కారాలను ప్రదానం చేస్తున్నామని, ఇప్పటివరకు ఎటువంటి అవార్డులు పొందని క్రొత్తవారికి హంస అవార్డులను పారదర్శకంగా అందిస్తున్నామన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్ర విభజన ద్వారా పొందాల్సిన కొన్ని ప్రయోజనాలను తీసుకువచ్చామన్నారు. తెలుగు విశ్వవిద్యాలయానికి సంబంధించిన మరికొన్ని విభజన ప్రయోజనాలు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంలో భాగంగానే ఇంగ్లీష్ మీడియాన్ని తీసుకువచ్చారని అన్నారు. తెలుగు, సంస్కృతి అకాడమీ ఆధ్వర్యంలో భవిష్యత్ లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



సాహిత్యవేత్త శలాక రఘునాథశర్మను సన్మానిస్తున్న దృశ్యం



ప్రభుత్వ హంస పురస్కారాల గ్రహీతలు

రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ దేశ భాషల్లో తెలుగు భాషకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయలు, సాహిత్యాలకు సంబంధించిన పుస్తక సంపద ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ కేంద్ర గ్రంథాలయంలోను, నన్నయ భారతి దాతల పుస్తక గ్రంథాలయంలోనూ నిక్షిప్తమై ఉందన్నారు. తెలుగు భాష ఖ్యాతిని పెంచే విధంగా విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని అన్నారు.

ఆచార్య శలాక రఘునాథశర్మ మాట్లాడుతూ తెలుగు భాష నన్నయ నుండి నేటి వరకు ఎంతో మార్పు చెందుతూ ప్రజల మధ్య దేదీప్యమానంగా వెలుగొందుతుందని అన్నారు. తెలుగుభాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి మరువలేనిదన్నారు. ఏ భాషలోను లేని గొప్ప మాధుర్యం, మమకారం తెలుగు భాషలో ఉందన్నారు. తెలుగు భాష ఆత్మ గౌరవంతో ప్రపంచంలో ఎక్కడ ఉన్న తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాధించుకున్న భాష తెలుగు భాష అని అన్నారు. ఇతర భాషల్లో అనువాదం చేసినప్పుడు భాషా దోషాలు లేని గొప్ప భాష తెలుగు భాష అని కొనియాడారు. నన్నయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సహస్రాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయని, ఇప్పుడు అకాడమీ ఆధ్వర్యంలో పురస్కారాల కార్యక్రమంలో విజయవంతం అవుతుందని తెలిపారు.

జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేసారు. రాజమహేంద్రవరంలో జక్కంపూడి రామ్మోహనరావు కృషి ఫలితంగా ఏర్పాడిన నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుభాష, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. అలాగే విశ్వవిద్యాలయంలో రాజరాజనరేంద్రుని పీఠం, జానపద సాహిత్య పీఠం, తెలుగుభాష మ్యూజియం వంటివి ఏర్పాటు చేయాలన్నారు. నేదునూరి గంగాధరం సాహిత్య పీఠం ఏర్పాటు చేసి తెలుగు భాషకు కృషి చేయాలని కోరారు.

ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం అని అన్నారు. రాజరాజనరేంద్రుడు పరిపాలించిన రాజమహేంద్రవరం వేయ్యేళ్ళ చరిత్రను ప్రతిబింబించే విధంగా రాజమహేంద్రవరంలో గొప్ప పండుగను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. తెలుగు భాష, సాహిత్య అభివృద్ధికి కృషి చేస్తున్న అకాడమీ వారిని, విశ్వవిద్యాలయాన్ని అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తేనెవంటి తెలుగు భాషకు, సంస్కృతికి కృషి చేస్తూ పురస్కారాలు అందుకుంటున్న ప్రముఖులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు మహాసభల్లో తాను శ్రీకృష్ణదేవరాయుల వేషం వేసిన అనుభవం ఎప్పటికీ మర్చిపోలేనని గుర్తుచేసారు. కృష్ణదేవరాయులు కన్నడ వాసి అయినప్పటికి దేశభాషలందు తెలుగు లెస్స అని పలికిన మహనీయుడని అన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ గా ఆచార్య కె.పద్మరాజు విశేష సేవలు అందిస్తున్నారని చెప్పారు. తెలుగుజాతి గర్వించదగిన మహనాయకుడు ఎన్టీఆర్ అని, తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేసిన నాయకుడు వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. ఎన్టీఆర్, వై.ఎస్.ఆర్ లకు భారతరత్న ఇవ్వాలని మంత్రి పేర్కొన్నారు. తరువాత సాహిత్యవేత్త శలాక రఘునాథశర్మను సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభవంతులైనవారికి తెలుగు, సంస్కృత అకాడమీ హంస పురస్కారాలను ప్రదానం చేసారు. హంస పురస్కారాలు సాహిత్య రంగంలో ఎస్. అబ్దుల్ అజీజ్ రచయిత కర్నూలు, మోదుగుల రవికృష్ణ ఉపాధ్యాయులు గుంటూరు,డా. జడా సుబ్బారావు అసిస్టెంట్ ప్రొఫెసర్ నూజివీడు, డా.జక్కు రామకృష్ణ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు విజయనగరం, వై.హెచ్.కె. మోహనరావు విలేఖరి, పిడుగురాళ్ళ గుంటూరు అందుకున్నారు. సామాజిక రచనలు విభాగంలో ఎండపల్లి భారతి గారు – రచయిత్రి చిత్తూరు, కవిత్వ రచనలు విభాగంలో డా. మాడభూషి సంపత్ కుమార్ ఆచార్యులు నెల్లూరు, అవధానరంగం డా.సూరం శ్రీనివాసులు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నెల్లూరు,తెలుగు భాషాభివృద్ధికి సాంకేతిక సహకారం విభాగంలో డా. కె.వి.ఎన్.డి. వరప్రసాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజమండ్రి వారికి హంస పురస్కారాలు ప్రదానం చేసారు. అకాడమీ నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రథమ బహుమతి గండికోట హిమశ్రీ, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు, ద్వితీయ బహుమతి వి. జస్మిత రెడ్డి, మంగళగిరి, గుంటూరు లకు అందజేసారు. చక్కని నృత్య ప్రదర్శనలు చేసిన కూచిపూడి డిప్లమా విద్యార్థులను, తెలుగుశాఖ విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమంలో అకాడమీ అధికారులు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# నన్నయలో జాతీయ క్రీడా దినోత్సవం





**29.08.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి ని పురస్కరించుకుని నేషనల్ స్పోర్ట్స్ డే సెలబ్రేషన్స్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ అండ్ టెన్నిస్ ప్లేయర్ బుద్ధావతారం రాజు, తూర్పుగోదావరి చీఫ్ కోచ్ డి.ఎం.ఎం.శేషగిరి హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేసారు.

ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ధ్యాన్ చంద్ ను స్పూర్తిగా తీసుకొని యువత క్రీడల్లో రాణించాలని అన్నారు ఖేలో ఇండియా నిధులతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మల్టిపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. అలాగే కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ లో కూడా క్రీడాభివృద్ధికి ప్రణాళికలను, ప్రతిపాదనలను పంపించామన్నారు. ఖేలో ఇండియా పోటీల్లో నన్నయ విశ్వవిద్యాలయానికి సిల్వర్ మెడల్ వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో తక్కువ ఫీజులతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎం.పి.ఈడీ కోర్సును అందిస్తున్నామని, అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లోను పట్టు సాధించాలని విద్యార్థులకు సూచించారు. క్రీడలు మానవ శరీరానికి వ్యాయమంతో పాటు మానసిక ఉల్లాసానికి కారణం అవుతాయని తెలియజేసారు. విశ్వవిద్యాలయంలో చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాన్ని అభినందించారు.

రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ క్రీడాకారులందరికీ జాతీయ.క్రీడాదినోత్సవ శుభాకాంక్షలను తెలియజేసారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఎం.పి.ఈడీ కోర్సు గల విద్య సంస్థ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయమని అన్నారు. విశ్వవిద్యాలయంలో క్రీడాభివృద్ధికి విశిష్ట ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్ లో విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేసారు. చీఫ్ కోచ్ డి.ఎం.ఎం.శేషగిరి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె.పద్మరాజు క్రీడలకు అధిక ప్రాధాన్యతనివ్వడం హర్షనీయమని అన్నారు. ఆరోగ్యవంతమైన జీవనానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. తరువాత జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ అండ్ టెన్నిస్ ప్లేయర్ బుద్ధావతారం రాజును సన్మానించి జ్ఞాపికను అందజేసారు. సంవత్సరాల బుద్ధావతారం రాజు పాలకొల్లులో ఎస్.ఎస్.ఎల్.సి, భీమవరం డి.ఎన్.ఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసారు. 1960 సంవత్సరంలో బాల్ బ్యాడ్మింటన్‌లో జూనియర్ నేషనల్ మరియు 1962లో సీనియర్ నేషనల్స్‌లో గెలిచారు. అలాగే హైదరాబాద్‌లో బాల్ బ్యాడ్మింటన్ మరియు షటిల్ బ్యాడ్మింటన్‌లో దాదాపు 60 ఓపెన్ టోర్నమెంట్‌లను గెలుచుకున్నారు. నేటి వరకు వివిధ స్థాయి పోటీలలో 125 సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌లను గెలుచుకొని నేటి యువతకు స్పూర్తిగా నిలిచారు. 1994 నుండి ఇప్పటి వరకు %ూాxూాూ% (ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్)కి కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. మన ప్రాంతానికి చెందిన ఇటువంటి సీనియర్ క్రీడాకారుని నుండి విద్యార్థులు, క్రీడాకారులు ఎంతో నేర్చుకోవాలని వీసీ తెలియజేసారు. బుద్ధావతారంరాజు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, ఆరోగ్యవంతమైన జీవనానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు మెడల్స్ ను ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డా.బి.రామ్ గోపాల్, కోర్సు కోఆర్డినేటర్ డా.కె.బాలసత్యనారాయణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు పాల్గొన్నారు.



# సంపాదకీయం




## గురు పరంపర

విద్యార్థుల జీవితాల్ని ప్రభావితం చేసిన గురువులు విద్యార్థుల మనసుల్లో దేవుళ్ళలా కొలువుండిపోతారు. మన పురాణాల్లో గురుశిష్య సంబంధం పై బోలెడన్ని కథలున్నాయి. శ్రీరామునికి విద్య నేర్పిన గురువుగా వశిష్టునికి విశిష్ట స్థానముంది. రామలక్ష్మణులకు బల,అతిబల విద్యలు నేర్పిన గురువు విశ్వామిత్రుడు.అవతార పురుషులైన బలరామకృష్ణులకు చదువు చెప్పింది సాందీపని మహాముని. జమదగ్ని మహర్షి కుమారుడైన పరుశురాముడు అస్త్ర విద్యాపారంగతుడైన ఆచార్యునిగా సుప్రసిద్ధుడు. భరద్వాజ పుత్రుడైన ద్రోణుడు కౌరవ పాండవులకు అస్త్రవిద్యలు నేర్పిన గురువుగా ప్రసిద్ధుడు. అర్జునుని తనవలె ధనుర్విద్యాపారంగతునిగా తీర్చిదిద్దాడు.

జాతికి దిశా నిర్దేశం చేసిన అరుదైన ఆధ్యాత్మిక గురువులు ఎంతోమంది ధార్మిక జీవన పునరుద్ధరణకు, శాంతి సామరస్యాలవైపు సమాజాన్ని నడిపించటానికి కృషి చేశారు.వారి బోధనలు మనకు నిత్య మార్గదర్శకాలు.అద్వైత మత స్థాపకులైన శంకరాచార్యులు జగద్గురువులుగా కీర్తింపబడి తరతరాలకు తరగని ఆధ్యాత్మిక సంపత్తిని జాతికందించారు. విశిష్టాద్వైత మతవ్యవస్థాపకులైన రామానుజాచార్యులు ఆధ్యాత్మిక సామ్యవాది.భక్తితోనే జీవాత్మ పరమాత్మను చేరుకోగలరని బోధించిన గురువు. రామకృష్ణ పరమహంస దైవం ఒక్కటేనని చేరుకునే మార్గాలే వేరని బోధించి భారతీయ సాంస్కృతిక ఆధ్యాత్మిక విశిష్టతను ప్రపంచానికి చాటిన స్వామివివేకానంద వంటి శిష్యుని తీర్చిదిద్దారు. పరమహంస యోగానంద భారతీయ యోగవిద్యను పాశ్చాత్య ప్రపంచానికి చేరువ చేశారు.

ప్రాచీన గురుకులాల్లో వివిధ శాస్త్రాల్లో విద్యలను విద్యార్థులను తీర్చిదిద్ది దేశచరిత్ర గమనాన్నే మార్చిన ప్రాచీన గురువులు మన చరిత్రలో చాలామందున్నారు. అర్థశాస్త్రాన్ని అందించిన ఆచార్యులు చాణక్యుడు తక్షశిల విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా విద్యార్థులకు వివిధ శాస్త్రాలను బోధించారు.విష్ణుశర్మ రాజకుమారులకు బోధించడానికి ఆసక్తికరమైన పంచతంత్రాన్ని రచించారు. కాలపరీక్షకు నిలిచిన కథలవి. ఖగోళ శాస్త్రంలో తొలి పాఠాలు బోధించిన ఘనత ఆర్యభట్టునికే దక్కుతుంది.నలంద విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు గణిత ఖగోళశాస్త్ర మర్మాలను బోధించారు.సున్నాను కనుగొన్న ఘనతతో పాటు భాస్కరాచార్య వంటి ఉద్దండ శిష్యుల్ని తయారు చేశారు.

ఆధునిక విద్యారంగానికి పునాదులు వేసిన అగ్రగణ్యులు మనదేశంలో ఎంతోమందున్నారు. గురుదేవునిగా ప్రసిద్ధులైన టాగోర్ మహాశయులు బోధన నాలుగు గోడల మధ్యకాదని, ప్రకృతిఒడిలో జరగాలనే సిద్ధాంతంతో శాంతినికేతన్ ను స్థాపించారు. అదే నేటి విశ్వభారతి విశ్వవిద్యాలయం. దళితుల పట్ల వివక్షను తొలగించడానికి శాయశక్తులా కృషి చేసిన మహనీయులు టాగోర్. దేశంలోనే బాలికల కోసం పాఠశాలను నెలకొల్పిన వారు పూలే దంపతులు.సావిత్రీబాయి పూలే దళితుల్లో విద్యా వ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. దళితుల జీవితాల్లో విద్యా జ్యోతులు వెలిగించిన తొలి గురువు జ్యోతిరావుపూలే.దేశం గర్వించదగ్గ క్షిపణి నిపుణులు అబ్దుల్ కలాం. విద్యార్థులకు కలలు కనడం నేర్పి వాటిని సహకారం చేసుకోవాలని చెప్పిన గురువు. ఆయన శాస్త్రవేత్తే అయినా ప్రవృత్తి మాత్రం బోధన. బోధనలోనే తుది శ్వాస విడిచిన గొప్ప గురువు.

విద్యార్థులు బ్రహ్మరథం పట్టిన అరుదైన గురువు తత్వశాస్త్ర ఆచార్యులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్.పాఠాలు బోధించిన ప్రతి విద్యాసంస్థలోను విద్యార్థుల మనసులపై చెరగని ముద్రవేశారు. కలకత్తా విశ్వవిద్యాలయంనుండి విద్యార్థులే స్వయంగా రైల్వే స్టేషన్ వరకు ఆయనకూర్చున్న గుర్రబ్బగ్గీని లాగారంటే ఆయన విద్యార్థుల మనసులకు ఏ స్థాయిలో చేరువయ్యారో మనం అర్థం చేసుకోవచ్చు. ఆ మహనీయుని కోరిక మేరకు ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం.మనల్ని తీర్చిదిద్దిన మన ఉపాధ్యాయులను స్మరించుకుంటున్నాం.అటువంటి గురువులందరికీ పాదాభివందనాలు!!.

*ఆచార్యదేవోభవ!*

# భాస్కరరావు సేవలు అభినందనీయం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఆఫీస్ అసిస్టెంట్ గా పని చేస్తున్న బి. భాస్కరరావు పదవీవిరమణ సభను క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కమలకుమారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ బి.భాస్కరరావు 1993లో విధుల్లోకి ప్రవేశించినప్పటి నుండి ఈ 30 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో క్యాంపస్ లో అందరికంటే మితవాదిగా, ఒక సమయపాలన కలిగినవ్యక్తిగా, తనకి ఇచ్చిన పనిని సక్రమంగా నిర్వర్తించి అందరి మన్నలను పొందుతూ ఏనాడు ఎవరితోనూ మాట అనిపించుకోకుండా మెలిగిన వ్యక్తిగా ఆయన నుండి మనం ఇలాంటి మంచి విషయాలు అలవర్చుకోవాల్సిందిగా, వారికి పదవి విరమణ అనంతరం మంచి విశ్రాంతి మరియు ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ ఉండవలసిందిగా వారికి శుభాకాంక్షలు అందజేశారు. 30 ఏళ్ల తన ఉద్యోగ జీవితంలో ఎందరో స్పెషలాఫీసర్లు, అధ్యాపకులు, తన తోటి స్నేహితులు సహచరులు ఈ విధంగా తన జీవితంలో ఒక భాగమైనందుకు నిజంగా పూర్వజన్మ సుకృతంగా అలాగే తన ఉద్యోగ నిర్వహణలో ఉండగా కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకున్న తన భార్యకు, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికార యంత్రాంగానికి భాస్కరరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏయు విశ్రాంత ప్రొఫెసర్లు విశ్వనాథరావు, వెంకట రత్నం, డాక్టర్ పోచయ్య , కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కె.వరప్రసాద్ అధ్యాపకులు మహమ్మద్ నదీమ్, డా.అజయ్ రతన్, డాక్టర్ హారిక, డా.స్టీఫెన్ జోసఫ్, డా. శ్రీరామరాజు, డా. హరిబాబు, డా. గోపి, డా. అప్పారావు, రాధా మాధవి తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు భాస్కర రావు గారి బంధువులు పాల్గొని దంపతులు ఇద్దరినీ సత్కరించారు.

# రోప్ స్కిప్పింగ్ పోటీలో గూడెం విద్యార్థి ప్రతిభ

ఆదికవి నన్నయ యూనివర్శిటీలోని ఫార్మసీ విభాగం మూడవ సంవత్సరం విద్యార్థిని వి. న్యూరోసీ భీమవరంలోని డి.ఎన్. ఆర్ కళాశాలలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలలో అసాధారణ ప్రతిభ కనబరిచింది. రెండు గ్రూపులు, సింగిల్ లెవల్స్‌లో నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యారు. న్యూరోసీ అసాధారణమైన నైపుణ్యం మరియు దృఢ సంకల్పాన్ని ప్రదర్శించి, పోటీలో ప్రతిష్టాత్మకమైన బంగారు మరియు రజత పతకాలను సాధించింది.ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ విభాగం తన విద్యార్థులలో సమగ్ర అభివృద్ధిని పెంపొందించడంలో చదువులతోనే కాకుండా ముఖ్యంగా క్రీడల్లో సామాజిక సేవ అన్ని కార్యక్రమాలలో ప్రోత్సహిస్తుంది. క్యాంపస్ అధ్యాపక బృందం, విద్యార్థులు రోసిని అభినందించారు.




# కాకినాడ క్యాంపస్‌లో క్రీడా దినోత్సవం

**29.08.23**

**(మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు మేజర్ ధ్యాన్ చంద్ 118 వ జయంతి ని పురస్కరించుకొని క్యాంపస్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ డా.ఎం.కమలకుమారి మాట్లాడుతూ" ధ్యాన్ చంద్ ఒక సుప్రసిద్ధ హాకీ ఆటగాడిగా గుర్తింపు కలిగిన వ్యక్తి అని స్వాతంత్రం రాకముందు బ్రిటిష్ ఆధీనంలో ఉన్న భారత క్రీడాకారుల్లో ఒక స్ఫూర్తి నింపిన , హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకరు అని. గోల్స్ చేయడంలో మంచి ప్రతిభ కనబరుస్తు, భారతదేశానికి హాకీలో స్వర్ణయుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టిన మహెూన్నత వ్యక్తిగా కొనియాడారు అందుకే ఆయన జయంతిని పురస్కరించుకొని మనం అందరం జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డా.ఎం నాని బాబు, డా.ఎం.శ్రీదేవి ,డా.పోచయ్య, డా.అజయ్ రతన్, డా. హారిక, డా.విజయశ్రీ, డా. జోసెఫ్ స్టీఫెన్ డా .గోపి, డా. ఉమా రజిత బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొని పూలమాలలతో సత్కరించారు






గురుర్బ్రహ్మ,గురుర్విష్ణు:
గురుర్దేవో మహేశ్వరః !
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ
తస్మైశ్రీ గురవేన్నమః !!

**డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి**

(సెప్టెంబర్ 5)

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు!!

- నన్నయవాణి

# ఉపకులపతి ఉవాచ




గురుశిష్య పరంపర మనదేశంలో ప్రాచీనమైన,పవిత్రమైన అంశం. శిష్యుల మీద గురువులకు అవ్యాజమైన వాత్సల్యం ఉంటుంది. చదువు మాత్రమే కాకుండా వినయ విధేయతలను నేర్పే వారే నిజమైన గురువులు. అలాంటి గొప్ప గురువులు మన చరిత్రలో,సాహిత్యంలో, మన ఇతిహాసాల్లో కనిపిస్తారు. మనిషి అభివృద్ధి పథంలో నడుస్తున్న ప్రతిచోటా గురువు ఉంటాడు. అటువంటి వాళ్ళు సిలబస్ లో పాఠాలు చెప్పడంతోనే సరిపెట్టుకోరు. లోకరీతిని,నీతిని అవగతంచేసి నడవడికను తీర్చిదిద్దుతారు. ఉన్నతమైన ఆశయాలను ఉద్బోధించి ఆ దిశగా దారి చూపుతారు. విద్యార్థుల జీవితాన్ని ప్రభావితం చేసే వారే నిజమైన ఉపాధ్యాయులు.

విద్యార్థులు బ్రహ్మరథం పట్టిన అరుదైన గురువుగా మనం డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని చూస్తాం. పనిచేసిన పదవులకే వన్నెతెచ్చిన మహనీయులాయన. తన జయంతి రోజున ఉపాధ్యాయుల దినోత్సవం జరుపుకుంటే సంతోషిస్తానన్నారు. 1962 నుంచి మనం సెప్టెంబర్ 5వ తేదీన ఆయన జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటూ ఉంటాం. ఈ సందర్భంగా విద్యార్థులలో ప్రరోచన కలిగించి వారి జీవితాలకి దిశా నిర్దేశం చేసే ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ఆచార్య కె.పద్మరాజు

# లోకానికి ఒక లేఖ

**( అబ్రహం లింకన్ టీచర్ కి రాసిన లేఖ)**



ఇంకొక రెండు గంటల్లో మా అబ్బాయి మొట్టమొదటిసారిగా బడిలో చేరబోతున్నాడు. ఈ లోకంలో ఉన్న మీరందరూ వాడిని చేయి పట్టుకొని నడిపిస్తారని నా ఆశ. కొంతకాలంపాటు అంతా వింతగానూ, విడ్డూరంగానూ ఉండక తప్పదు. మీరందరూ వాడిని కొంచెం సుకుమారంగా చూస్తారని కూడా నా ఆశ. ఇప్పటిదాకా ఇంట్లో పెత్తనమంతా వాడిదేనని మీకూ తెలుసు. ఇంటి వెనుక తోట అంతా వాడి పరిపాలనలోనే ఉంది. ఎప్పుడైనా కన్నులు చెమ్మగిల్లితే ప్రక్కనే నాకోసం చూస్తాడు.

కానీ ఇప్పుడో... మొత్తం జీవిత రంగమే మారిపోతున్నది. కొంచెంసేపు గడిస్తే, ఇంటి ముందరి మెట్లుదిగి,వెనుకకు తిరిగి టాటా చెప్పి,గొప్ప సాహసవీరుడన్నట్లు బడి దగ్గరకు వస్తాడు. ఈ సాహసంలో విఘాతాలు,విషాదాలు,విచారాలు ఉండటం కూడా తథ్యమే.

ఈ ప్రపంచంలో జీవించడానికి శ్రద్ధా విశ్వాసాలు, ప్రేమ, ధైర్యము ఉండి తీరాలి. వాడు ఇంకా ఇవేవీ తెలియని చిన్నతనంలో ఉన్నాడు. కనుక వాడిని దగ్గరకు తీసుకొని,వాడు నేర్చుకోవలసిన విషయాలన్నీ అర్థమయ్యేటట్లు చేస్తారని నా ఆశ. వాడికి శిక్షణ ఇవ్వండి. చేతనైతే ఆ పని సౌమ్యంగా చెయ్యండి.

వాడు నేర్చుకోక తప్పదు. మనుష్యులందరూ న్యాయబద్ధులుగా ఉండరనీ,అందరూ నిజమే చెప్పరనీ నాకు తెలుసు. అసుర శీలం కలవాళ్ళతోపాటు అమరశీలం కలవాళ్ళు కూడా ఉన్నారనీ, ప్రజలను జీవచ్ఛవాలుగా చేసే రాజకీయ వాదులతో పాటు ప్రజాసేవకై ఆత్మార్పణం చేసే నాయకులున్నారని వాడికి తెలియాలి. ఒకడు శత్రువుగా ఉంటే ఇంకొకడు మిత్రుడుగా ఉంటాడని కూడా నేర్పండి.

పోట్ల దున్నపోతులాగా పుందరించి మీద మీదకు వచ్చేవాళ్లే మట్టికరచి మట్టిలోనే కలసిపోతారని కూడా వాడికి ఎంత త్వరగా తెలిస్తే అంత మంచిది. ఉద్గ్రంథాలలో ఉన్న అద్భుతాలు వాడికి తెలియాలి. వియత్పథంలో విహంగాలు,దినమణి రశ్మిలో తేనెటీగలు,హరితగిరులపై అలరించే విరులు, ఈ అన్నిటి వెనుక ఉన్న సృష్టి రహస్యం అవగాహన చేసుకొనడానికి వాడిని కొంతసేపు ప్రశాంతంగా ఉండనివ్వండి.

మోసగించి పైకి పోవడంకంటే కపటంలేని నిష్ఫలత్వంతో ఉండటమే ఎంతో గౌరవమని వాడికి తెలియాలి. ఇతరులెంత చెప్పినా ఒప్పుకొనలేనప్పుడు వాడి ఊహలమీద విశ్వాసం వాడికి ఉండనివ్వండి.

పేరుకోసమో,పెన్నిధికోసమో పిచ్చిగా రెచ్చిపోయే మందజనుల వెంట పడనివ్వని మనోబలం వాడికి ఇవ్వగలరా? అందరు చెప్పేదీ వినవచ్చు,కానీ అంతరంగంలో ఉన్న సత్యమనే తెరమీది వెలుగులో నిలబడగలిగిన వాటినే వాడు అనుసరించేటట్లు చేసి చూపించండి. బ్రతుకు తెరువు విషయంలో భుజ బలాన్ని,బుద్ధి బలాన్ని ఎక్కువ ఆశ పెట్టిన వాడికే ముడుపు కట్టినప్పటికీ ఆ ప్రభావం వాడి హృదయం మీద కానీ,అంతరాత్మ మీద కానీ పడకూడదు.

అనుచితమైన పని చెయ్యాలని అలమటించి అరచి చచ్చేవాళ్ళు ఎంతమంది ఉన్నా తనకు ఉచితమని తెలిసిన దానికోసం నిలబడి ప్రతిఘటించే బలం వాడికి రావాలి. ఈ శిక్షణ అంతా సౌమ్యంగా ఇవ్వండి. కానీ గారాబం చేయవద్దు. నిప్పులో ఉండవలసిన పరీక్ష నెగ్గి నిగానిగలాడుతూ వెలుపలికి వచ్చినదే నిజమైన ఉక్కు అన్న సంగతి కూడా నాకు తెలుసు. నా ఆశ ఆకాశమంత అంటే,ఆ మాట నిజమే,కానీ మీరు చెయ్యగలిగినది చెయ్యండి.

ఇంతగా అభ్యర్థించటం ఎందుకంటే ఈ రోజు వరకు వాడు అభం,శుభం ఎరుగడు. ఇతరులను ద్వేషించటం ఎరుగడు.

- అబ్రహాం లింకన్

(అనువాదం: స్వర్గీయ శ్రీ వెంపటి కృష్ణమూర్తి గారు, తెలుగుశాఖ, శ్రీ వై.ఎన్. కళాశాల, నరసాపురం, ప.గో.జిల్లా.)

# నన్నయ వర్సిటీకి 125 అధ్యాపక పోస్టులు మంజూరు


**వీసీ ఆచార్య కె.పద్మరాజు**

**02.09.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీకి 125 అధ్యాపక పోస్టులు మంజూరు అయ్యాయని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శనివారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేసారు. విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు పోస్టులను ఉన్నత విద్యామండలి హేతుబద్ధీకరిస్తూ ఉత్తర్వులు విడుదల చేసిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి 128 అధ్యాపక పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వీటిలో మూడు పోస్టులను ఆయా కారణాలతో నిలుపుదల చేసారన్నారు. నన్నయ యూనివర్సిటీలో ఇప్పటికే 26 పోస్టులు వివిధ కేటగిరీల్లో ఉండగా అదనంగా 99 మందిని నియమించేందుకు అవకాశం లభించిందని చెప్పారు. వీటిలో 77 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 33 అసోసియేట్ ప్రొఫెసర్లు, 18 ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయన్నారు. నవంబర్ 14 లోగా కొత్తగా మంజూరైన పోస్టులలో నియామకాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. నూతన అధ్యాపక నియామకాలతో విశ్వవిద్యాలయ బోధన, పరిశోధనలలో మరింత నాణ్యత పెరుగుతుందని తెలియజేసారు.



## మంచి మాట




దీపం వెలుగుతుంటేనే
మరికొన్ని దీపాల్ని
వెలిగించగలదు.
నిరంతరం నేర్చుకునే
ఉపాధ్యాయుడు మాత్రమే
చక్కని విద్యార్థులను
తయారు చేయగలడు.

- రవీంద్రనాథ్ టాగోర్ం





వీసి ఆచార్య పద్మరాజును అభినందించిన రోటరీ క్లబ్ సభ్యులు.

వీసీ పద్మరాజుకు అభినందనలు




వీసీ పద్మరాజును అభినందించిన కృష్ణస్వామి పద్మనాభం స్పోర్ట్స్ ఫెడరేషన్స్, కాకినాడ



కృష్ణం వందే జగద్గురుమ్

శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు!!

- నన్నయవాణి



## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన రిజిస్ట్రార్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని పీజీ రెండవ సెమిస్టర్ ఫైనల్ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. శుక్రవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో జరుగుతున్న పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్ పరిశీలించారు. ఆయనతోపాటు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల, అధ్యాపక బృందం ఉన్నారు.



## ప్రొఫెసర్ సురేష్ వర్మకు అభినందనలు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ మెంబర్ గా నియమితులైన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ పి.సురేష్ వర్మకు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు కోడింగ్ మరియు ఉద్యోగ అవకాశాలను ఏవిధంగా పొందాలనే అంశాలను సురేష్ వర్మ వివరించారు. ఈకార్యక్రమంలో సుధాకిరణ్, విజయదుర్గ, కృష్ణ, వెంకటరత్నం, సంతోషి తదితరులు పాల్గొన్నారు.



## బిఎస్సీ పాఠ్యపుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ

**29.09.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.వెంకటరావు మరియు ఇతర అధ్యాపక బృందంతో రచించబడిన బిఎస్సీ మొదటి సెమిస్టర్ కు సంబంధించిన "ఎస్సెన్షియల్స్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ మెథమటికల్, ఫిజిక్స్ అండ్ కెమికల్ సైన్సెస్" పాఠ్య పుస్తకాన్ని వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయంలో గురువారం పాఠ్యపుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ వివరాలను తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల్లోని బిఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ పాఠ్యపుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అధ్యాపకుడు డా.జి.వెంకటరావు, ఆర్ట్స్ కాలేజ్ అధ్యాపకుడు డా.కె.నవీన్ కుమార్, ఆయా కళాశాలల అధ్యాపకులు డా.షేక్ సల్మాబేగం, డా.కె.పుష్పలత, ఆర్.రేణుకశ్రీ లు పాఠ్య పుస్తక రచయితలుగా ఉన్నారని తెలిపారు. విశాఖపట్నానికి చెందిన శ్రీ పబ్లిషింగ్ హౌస్ వారు ఈ పుస్తకాన్ని ప్రచురించారని అన్నారు. డాక్టర్ జి వెంకటరావు ప్రసిద్ధ పాఠ్యపుస్తకాల రచయితగా ఇప్పటికే విద్యార్థుల కోసం మూడు పుస్తకాలు వ్రాసారని తెలిపారు. విద్యార్థులు చదువులలో రాణించడానికి బోధనాపరంగా మంచి మెటీరియల్‌లను రూపొందించడంలో అంకితభావం, విద్యా నైపుణ్యం, నిబద్ధత స్పష్టంగా కనిపిస్తుందని రచయితలను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.పి.ఎస్.సి మెంబర్ ఎ.వి.రమణరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా బి. కెజియా రాణి, డా.వి.పెర్సిస్, ఆచార్య పి.సురేష్ వర్మ, డా.కీర్తిమరిట లు వెంకటరావు ను అభినందించారు.

# డా.తరపట్లకు గిడుగు పురస్కారం

**29.08.23 (మీడియాసెల్)**


డా.తరపట్ల సత్యనారాయణను అభినందిస్తున్న వీసీ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖ అధ్యాపకులు డా. తరపట్ల సత్యనారాయణకు తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు వేంకట రామ్మూర్తి పురస్కారాన్ని ప్రదానం చేసారని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. గురువారం యూనివర్సిటీలో డా.తరపట్ల సత్యనారాయణను వీసీ అభినందించి వివరాలను తెలియజేసారు. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యాలలో విశేష కృషి, విశ్వవిద్యాలయంలో జాతీయ,అంతర్జాతీయ సదస్సులను నిర్వహించిన తెలుగుశాఖ అధ్యాపకులు డా.తరపట్ల సత్యనారాయణకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధిప్రాధికార సంస్థ వారు గిడుగు పురస్కారాన్ని ప్రదానం చేసారన్నారు. విజయవాడలో జరిగిన తెలుగుభాషా దినోత్సవ కార్యక్రమంలో అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు, సిఈఓ మల్లికార్జునరావు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారని తెలియజేసారు. త్వరలో జానపద కళల పరిరక్షణలో భాగంగా దక్షిణ భారతీయ జానపద విజ్ఞాన సదస్సును నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తెలుగుభాషాభివృద్ధి మరింత కృషి చేయాలని, విశ్వవిద్యాలయంలో మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో డా.ఎన్.కిరణ్ చంద్ర, డా.ఎన్.రాజశేఖర్, డా.ఆర్.జానకిరావు తదితరులు పాల్గొన్నారు.


వీసీ పద్మరాజు ని కలిసిన నూతన ఈసీ మెంబర్లు

## నన్నయ వర్సిటీ నూతన పాలక మండలి నియామకం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ నూతన ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ మెంబర్స్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం యూనివర్సిటీ వీసీ కార్యాలయంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు నూతన ఈసీ మెంబర్స్ కు శుభాకాంక్షలను తెలియజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ నూతన పాలక మండలిని నియమిస్తూ ప్రభుత్వం జివో నెంబర్ 77 ను విడుదల చేసిందని, ఆయా విభాగాల నుండి నిష్ణాతులైన వారిని ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ మెంబర్స్ గా ఏర్పాటు చేసిందన్నారు.నూతన కార్యనిర్వాహక మండలి సభ్యులుగా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ డా.పెనుమెత్స సురేష్ వర్మ, యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల, అనుబంధ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.జ్యోతి, యూనివర్సిటీ కాలేజ్ అధ్యాపకురాలు డా.కె.నూకరత్నం, అనుబంధ కళాశాల అధ్యాపకురాలు వసంతలక్ష్మి, ఈ.డి.సి.ఐ.ఎల్ జనరల్ మేనేజర్ షేక్ సులేమాన్, లిటిల్ రోస్ డిగ్రీ కాలేజ్ ప్రెసిడెంట్ అండ్ కరస్పాండెంట్ గంధం నారాయణరావు, దేవి ఆక్వాఫీడ్స్ జనరల్ మేనేజర్ రాజ్ కుమార్, కమర్షియల్ టాక్సిస్ ఫార్మర్ డిప్యూటి కమీషనర్ వై.సత్యనారాయణ లు నియమితులయ్యారని తెలిపారు. ఉమ్మడి గోదావరి జిల్లాల ఉన్నత విద్యా కేంద్రమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేయాలని వీసీ సూచించారు. నూతనంగా నియమితులైన ఈసీ మెంబర్స్ కు రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## గూడెం క్యాంపస్‌లో క్రీడా దినోత్సవం



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మసీ స్పోర్ట్స్ క్లబ్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతి ని పురస్కరించుకుని స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాన్ని నిర్వహించింది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఫార్మసీ సిబ్బంది, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో, క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్ మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలవేసి ధ్యాన్ చంద్ తన విశిష్టమైన అంకితభావం, క్రమశిక్షణ మరియు పట్టుదల యొక్క విలువలను గుర్తుచేసారు. సమష్టి కృషి, సంకల్పం మరియు క్రీడాస్ఫూర్తి వంటి విలువలను పెంపొందించడంలో క్రీడల ప్రాముఖ్యతను తెల్పుతూ సభను ఉద్దేశించి ప్రసంగించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మసీ స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ హరి ప్రసాద్, కో చైర్మన్ శ్యామ్ మరియు క్లబ్స్ ప్రెసిడెంట్ రఘు వంశీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అశోక్ కోర్సు కోఆర్డినేటర్ డా.హీరాబట్టు ను మరియు ఫార్మసీ సిబ్బంది ఎస్.లిఖిత, పి.అరుణ మరియు విద్యార్థులను అభినందించారు.



## ఉపముఖ్యమంత్రిని కలిసిన గూడెం ప్రిన్సిపాల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను తాడేపల్లిగూడెం క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆచార్య టి.అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్ అభివృద్ధి ప్రణాళికలను, విద్యాపరమైన అంశాలను వివరించారు.

## వీసీ ని కలిసిన ఏ.పి.పి.ఎస్.సి మెంబర్ ఎ.వి.రమణరెడ్డి




ఎ.వి.రమణరెడ్డిని సన్మానిస్తున్న వీసీ పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.పద్మరాజును ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (ఏ.పి.పి.ఎస్.సి) మెంబర్ ఎ.వి.రమణరెడ్డి కలిసారు. గురువారం యూనివర్సిటీ వీసీ కార్యాలయంలో వీసీ పద్మరాజును కలిసిన ఎ.వి.రమణరెడ్డిని వీసీ సన్మానించి అభినందించారు. వీసీ కె.పద్మరాజు గతంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ మెంబర్ గా పని చేసి విశేష సేవలందించారు. ప్రస్తుతం తన మిత్రుడు ఎ.వి.రమణరెడ్డిని కలవడం చాలా ఆనందంగా ఉందని వీసీ తెలిపారు.

## కాకినాడ క్యాంపస్‌లో పూర్వ విద్యార్థి సమ్మేళనం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ ఏ.యూ పీజీ సెంటర్ 1984-86 బ్యాచ్ నకు సంబంధించిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన సభని ఏర్పాటు చేసుకున్నారు. 1984-86 బ్యాచ్ పూర్వ విద్యార్థి నిరీక్షణరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.పద్మరాజు గారు మరియు మధ్యప్రదేశ్ డిజిపి పూర్వపు విద్యార్థి జి. జనార్దన్ - ఐపీఎస్ గారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి పద్మరాజు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ప్రతిఒక విద్యాసంస్థకు ఒక మార్గ నిర్దేశక కార్యకర్తలుగా వారి తర్వాత తరానికి ఒక మంచి స్ఫూర్తిగా వ్యవహరిస్తారని ఈ 1984-86 పూర్వ విద్యార్థులు అత్యున్నత స్థానాల్లో ఉంటూ అప్పటి ఆంధ్ర విశ్వవిద్యాలయం పీజీ సెంటర్లో విద్యార్థుల వలె తన గమ్య స్థానాలు వైపు సాగిన వ్యక్తులుగా వారి నుండి స్ఫూర్తి, పట్టుదల, క్రమశిక్షణ కలిగి మంచిమార్గంవైపు నడుచుకోవాలని పేర్కొన్నారు. అందరూ ఇక్కడ కలవడం నిజంగా గొప్ప విషయంగా పేర్కొన్నారు. మరొక ముఖ్య అతిథి మధ్యప్రదేశ్ డిజిపి జనార్దన్ ఐపీఎస్ మాట్లాడుతూ "పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం దగ్గరలో గల అతి చిన్న గ్రామానికి చెందిన తాను అత్యంత పేదరికం నుండి చదువుకు ప్రాధాన్యత ఇస్తూ అత్యున్నత చదువులు కోసం అప్పటి ఏయూ పీజీ సెంటర్ లో విద్యార్థిగా ఉన్నప్పుడు జీవితం మీద ఒకలక్ష్యం ఏర్పరచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశతో కష్టపడి చదివి ఐపీఎస్ సాధించాలని ఒక సాధారణ విద్యార్థి అయిన తాను భారత దేశంలోనే అసాధారణమైన పదవి అయినటువంటి ఒక రాష్ట్ర డిజిపిగా అత్యంత శిఖరాలను అధిరోహించడం నిజంగా తాను నమ్ముకున్న కష్టం మరియు క్రమశిక్షణ గురువులు నేర్పించిన మంచితనం ఇప్పటి విద్యార్థులు సివిల్ సర్వీసెస్ వంటి పోటీ పరీక్షలకు ఏ విధంగా తర్ఫీదు తీసుకోవాలి ఎలాంటి పుస్తకాలు చదవాలి అనే అంశాలపై విద్యార్థులకు విశదీకరించారు. అలాగే పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 1984 86 పూర్వ విద్యార్థులకు గుర్తుగా మహిళ హాస్టల్ లో 70,000 రూపాయల త్రాగునీటి శుద్ధి యంత్రాన్ని మరియు పురుషుల హాస్టల్ లో భోజన శాలలో బాలలకు సంబంధించి లక్ష రూపాయల విరాళాన్ని క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.కమలకుమారి గారికి అందజేశారు. ప్రతి సంవత్సరం ప్రతిభగల విద్యార్థులకు లక్ష రూపాయల ప్రోత్సాహక పురస్కారాలను పూర్వపు విద్యార్థుల నుండి అందజేస్తామని అలాగే 1996నకు సంబంధించిన పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్యక్షులు శ్యాం ఇన్స్టిట్యూట్ వ్యవస్థాపకులు జి. శ్యామ్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన తరపు నుండి కూడా లక్ష రూపాయలు విద్యార్థి ప్రోత్సకాలు సంబంధించి ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ, విజయవాడ ఏసిపి పి.భాస్కరరావు, విశ్రాంత ఏయు ప్రొఫెసర్లు విశ్వనాథరావు, వెంకటరత్నం, ఐ.దోసగిరిరావు, పూర్వ విద్యార్థులు,క్యాంపస్ ప్రస్తుత అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

## A Teacher's Prayer

Help me to remember the greatness
Of the work which has been given to me to do.

Help me always to remember that I work with the most precious materials in the world - the mind of the child.

Help me always to remember that I am making marks upon that mind which time will never rub out.

Give me patience to teach who are slow to learn, and even those who refuse to learn.

When I have to exercise discipline, help me to do so in sternness and yet in love.

Keep me away from the sarcastic and the biting tongue.

Help me to encourage and never to discourage those who are doing their best,even if that best is not very good.

Help me to help those children not to store things in their memories but to be able to use their minds and to think for themselves.



And in the midst of all the worries and the frustrations of my job - help me to remember that the future of nation and of the world is in my hands.

by...
William Barclay

## గురు దేవుని ప్రార్థన!

భగవాన్! నాకు విహితమైన అధ్యాపక వృత్తి ఎంత పవిత్రమైనదో, ఎంత సమున్నతమైన కర్తవ్యమో గుర్తించి, సదా స్మరించుకొనుటకు నీ సహాయమర్థించుచున్నాను. విశ్వాంతరాళమందు అత్యంత అమూల్యమైన విద్యార్థి మనసులతో నేను వర్తించుచు వ్యవహరించుచున్నానని అనుక్షణమూ స్మరించుకొనుటకు నీ సహాయము వేడుకొనుచున్నాను. విద్యార్థుల లేత మనసులపై కాలము సైతము చెరుపలేని ప్రగాఢ ముద్రలను వేయుచుంటినను స్మరణ నాకు సదా అనుగ్రహింపుము.

నెమ్మదిగా నేర్చుకొను, నేర్చుకొనుటకు ఇష్టము లేని విద్యార్థులకు సైతం నేర్పుగా నేర్పగల ఓర్పునొసంగి నా బోధనకు తగిన ప్రతిభనిచ్చి సహాయమొనర్పుము. క్రమశిక్షణ విషయంలో అవసరమగు కర్కశత్వమును పైకి బాహాటముగా ప్రదర్శించు చున్నను అంతరంగమున మాత్రము అనురాగ పూర్వకమైన హృదయమొసంగి సహాయమందిమ్ము.వ్యంగ్య ధోరణికి, మనస్సునకు బాధ కలిగించు సంభాషణమునకు నన్ను దూరము చేసి కాపాడుము.

తమ శాయశక్తులా కృషి చేయు విద్యార్థులను, ఆ కృషి సర్వోత్తమమైనది కాకున్నను, వారిని నిరంతరం ప్రోత్సహించుటకు, వారిని ఎన్నడూ నిరుత్సాహపరచకుండుటకు తగిన శక్తి యుక్తులను ప్రసాదించుము. కేవలం కంఠస్థమొనర్చుటగాక, విద్యార్థులు తమంతటతాము సొంతముగా ఆలోచించగల మేధాశక్తిని అలవర్చుకోగల సదభ్యాసమును వారికి నేర్పగల బలమొసంగుము.

పరాత్పరా! నా ఉద్యోగ బాధ్యతల నిర్వహణములో నైరాశ్యము, దుఃఖమయ పరిస్థితుల మధ్య నా వ్యక్తిగత విషయముల

లంపటములు నాకు మాత్రమే పరిమితము కావలెను.అట్టి విషమ దశయందు సైతం నా జాతి భవితవ్యమేకాక యావత్ప్రపంచ భవితవ్యం నా చేతులలో ఉన్నదని గుర్తించి, ఆ విషయాన్ని నేను ఎన్నడూ ఏమరుపాటు పొందని శక్తిని నా స్మృతి యందు నిలిపి నన్ను అనుగ్రహింపుము.



టీచర్స్ ప్రేయర్:
విలియం బర్క్‌లీ

తెలుగు అనువాదం:
ఆచార్య పొన్నపల్లి శ్రీరామారావు, ప్రిన్సిపాల్(రి) డిగ్రీ కళాశాల, మలికిపురం.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in